# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 382 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 06, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## డెత్ సెంటర్లుగా ఢిల్లీ కోచింగ్ సెంటర్లు

- ముగ్గురు విద్యార్థుల దుర్మరణం ఘటనపై విచారణ
- కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ,ఆగస్ట్5(నమస్తే ఉదయం): దేశ రాజధాని దిల్లీలో ఓ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన సంచలనంగా మారింది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా మిగతా.. 2లో

## ఉప ఎన్నికలు తప్పవు..!

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత అనివార్యం
- న్యాయకోవిదులతో బిఆర్ఎస్ బృందం భేటీ
- ప్రకటన విడుదల చేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

న్యూఢిల్లీ,ఆగస్ట్5(నమస్తే ఉదయం): పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని పలువురు ప్రముఖ న్యాయ కోవిదులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుల బృందం చర్చలు జరిపింది. అటు రాజ్యాంగ నిపుణులతోనూ ఇవ్వాళ పార్టీ ప్రతినిధి బృందం సమావేశమైంది. బీఆర్ఎస్‌ను వీడి



కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ నిపుణులతో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశం అయింది. త్వరలోనే సుప్రీంకోర్టులో పార్టీ తరపున కేసు వేయనున్నట్లు కేటీఆర్ తెలిపారు. కోర్టు తీర్పు ద్వారా నెల రోజుల్లోనే ఫిరాయింపు నేతల అనర్హత అంశంలో స్పష్టత వస్తుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారని, తెలంగాణలో మిగతా.. 2లో



## కవిత రెగ్యులర్ బెయిల్ విచారణ

- 7కు వాయిదా వేసిన రౌస్ అవెన్యూ కోర్టు

న్యూఢిల్లీ,ఆగస్ట్5(నమస్తే ఉదయం): దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇప్పట్లో తీహార్ జైలు నుంచి బయటికి వచ్చే మార్గాలు ఏ మాత్రం కనిపించట్లేదు. ఇప్పటికే బెయిల్ పిటిషన్‌ను పలుమార్లు పక్కన పెట్టిన రౌస్ అవెన్యూ కోర్టు.. సోమవారం నాడు డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఆగస్టు-7 కు తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్లు జడ్జ్ కావేరి భవేజా స్పష్టం చేశారు. సీనియర్ అడ్వకేట్ అందుబాటులో లేకపోవడంతో కేసును మరో రోజుకు వాయిదా వేయాలని కోరిన కవిత మిగతా.. 2లో



## సెప్టెంబర్‌లో కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్5(నమస్తే ఉదయం): జమ్మూ కశ్మీర్‌లో సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా సాగేందుకు, ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఐదేళ్ల కిందట ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్టికల్ 370ని మిగతా.. 2లో

# స్కిల్ వర్సిటీ ఏర్పాటు ద్వారా నైపుణ్య శిక్షణ

## స్కిల్ వర్సిటీ ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

- హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపుతాం
- ప్రవాసాంధ్రులతో ముఖాముఖిలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్5(నమస్తే ఉదయం): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడుల వేటలో భాగంగా ప్రస్తుతంఅమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి.. న్యూజెర్సీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. స్కిల్ వర్సిటీ ఛైర్మన్‌గా ఆయన రెండు మూడు





రోజుల్లో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం గత వారం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఇకపోతే హైదరాబాద్‌ను ప్రపంచం లోనే అగ్రగామి నగరంగా నిలుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుందని అన్నారు. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకుమించిన మిగతా.. 2లో

## హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ కొత్త సెంటర్

- 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్
- దాదాపు 15 వేల మంది యువతకు ఉద్యోగాలు
- అమెరికాలో సీఎంతో చర్చలు జరిపిన కంపెనీ ప్రతినిధి బృందం

హైదరాబాద్, ప్రపంచ స్థాయిలో ఐటి రంగంలో పేరొందిన కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణలో భారీ విస్తరణ ప్రణాళికకు ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లో దాదాపు 15 వేల మంది ఉద్యోగులకు పని కల్పించేలా కొత్త సెంటర్ నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఇరవై వేల మంది ఉద్యోగులుండేలా పది లక్షల చదరపు అడుగుల స్థలంలో ఈ సెంటర్ ను స్థాపించనుంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కంపెనీ ప్రతినిధి బృందంతో మిగతా.. 2లో





## జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం): ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి వస్తున్న వరద ఉధృతి కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం నాటికి జూరాల జలాశయంలో 318.090 మీటర్ల స్థాయిలో 8.790 టీఎంసీల నీరు నిల్వ ఉంచుకోగ ఎగువ ప్రాంతం నుంచి 2.65 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు 36 గేట్లను తెరిచి గేట్ల ద్వారా 2,47,204 క్యూసెక్కులను శ్రీశైలం జలాశయంకు వదులుతున్నారు. అదేవిధంగా విద్యుత్ ఉత్పత్తికి 22,710, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 750, భీమా లిఫ్ట్-1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, సమాంత కాలువకు 850, జూరాల కుడి, ఎడమ కాలువలకు 1,524 క్యూసెక్కుల చొప్పున మొత్తం జూరాల నుంచి 2,74,071 క్యూసెక్కులను వదులుతున్నట్లు జూరాల వరద నియంత్రణ కార్యాలయ అధికారులు తెలిపారు. అదే విధంగా నారాయణపూర్ జలాశయంలో 490.96 మీటర్లు,27.688 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఎగువ ప్రాంతం నుంచి 2లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో నారాయణపూర్ ప్రాజెక్టు 25 గేట్లను తెరిచి దిగువ జూరాల వైపు 1.89లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. ఆల్మట్టి జలాశయంలో 80.953 టీఎంసీల నిల్వ ఉండగా ఎగువ ప్రాంతం నుంచి ఆల్మట్టికి 2,91,028 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2లక్షల క్యూసెక్కులను వదులుతున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.



## పరిశ్రమలు పెట్టే యువతకు అన్ని విధాల సాయం

- మధిర ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన
- వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు ప్రోత్సాహం
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

ఖమ్మం,ఆగస్ట్5(నమస్తే ఉదయం): యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తే రుణాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజక వర్గంలోని ఎండపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మధిరలో ఏర్పాటవుతున్న ఇండస్ట్రియల్ పార్కు రాష్ట్రానికి రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాలనూ ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మధిర పట్టణ విస్తరణకు కావాల్సిన బైపాస్ రోడ్లు నిర్మిస్తాం. ఇండస్ట్రియల్ పార్కుకు రూ.44కోట్లు కేటాయించాం. విద్య, వ్యవసాయక, పారిశ్రామిక కేంద్రంగా మధిరను నిలుపుతాం. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధిచేసుకొని సమగ్రాభివృద్ధి సాధించాలి. మిగతా.. 2లో

## బంగ్లా పరిణామాలతో భారత్ అప్రమత్తం

- సరిహద్దుల్లో బలగాల మొహరింపు
- ఢాకాకు విమాన, రైలు సర్వీసుల నిలిపివేత
- హసీనా ఇంటిని దోచేసని ఆందోళనకారులు

ఢాకా,ఆగస్ట్5(నమస్తే ఉదయం): బంగ్లాదేశ్ లో రిజర్వేషన్ ఆందోళన పతాక స్థాయికి చేరుకోవడం, ప్రధాని షేక్ హసీనా అధికార నివాసంపై ఉవ్వెత్తున ఆందోళనకారులు దాడి చేయడం, దీనికి కొద్ది క్షణాలకు ముందే ఆమె తన పదవికి రాజీనామా చేసి సి-130 ఆర్మీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో దేశం విడిచిపెట్టడం వంటి పరిణామాలు శరవేగంగా చోటుచేసుకున్న



క్రమంలో ఆర్మీ చీఫ్ వాకరుజ్జమాన్ దేశంలో సైనికపాలన ప్రకటించారు. విపక్ష పార్టీలతో సంప్రదించి దేశంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. మరి కాసేపట్లోనే అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్‌ను కలుసుకోనట్టు తెలిపారు. ప్రజలంతా హింసకు దూరంగా ఉండాలని మిగతా.. 2లో

## శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నేరుగా ఏసీ బస్సు

- హామీ ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్

శ్రీశైలం,ఆగస్ట్5(నమస్తే ఉదయం): హైదరాబాద్ నుంచి శ్రీశైలం దేవస్థానానికి ప్రతి రోజూ ఒక ఏసీ బస్సును నడిపించేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలని స్వామి, అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు. తెలంగాణలోని ప్రతి మండలం నుంచి జిల్లాకేంద్రానికి ఓ ఏసీ బస్సును నడిపించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. అవసరమైతే మండల కేంద్రం నుంచి స్థానికుల అవసరాలుంటే హైదరాబాద్‌కు ఏసీ బస్సును వేయనున్నట్లు తెలిపారు. హామీ ఇచ్చిన విధంగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. రూ.లక్ష వరకు రుణమాఫీ చేశామని.. ప్రస్తుతం రూ.1.50లక్షల రుణమాఫీ



చేస్తున్నామన్నారు. త్వరలోనే రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ బ్జడెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర కేబినెట్‌లో తెలంగాణ నుంచి ఇద్దరు మంత్రులుగా ఉన్నారని.. వారిపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల సమస్యలు సామరస్యంగా పరిష్కారం చేసుకుంటామని పొన్నం పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ నోట నీతి మాటలా..?

- గతంలో ఓ నీతి..ఇప్పుడో నీతా
- ఆనాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకోలేదా
- కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ అద్దంకి దయాకర్

హైదరాబాద్,ఆగస్ట్5(నమస్తే ఉదయం): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడు తుందని.. తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ చేతకానితనం వలనే ఆ పార్టీ ఎమ్మెల్యేలు పక్క పార్టీల వైపు చూస్తున్నారన్నారు. మిగతా.. 2లో



# పరిశ్రమలు పెట్టే యువతకు అన్ని విధాల సాయం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల్లో ఉన్నవారు పరిశ్రమల వైపు మళ్లితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహమిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తే రుణాలు ఇప్పిస్తాని.. అందుకు తగ్గ వసతులు కల్పిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏడాది 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ డబ్బులు ఎక్కడ పెట్టుబడి పెట్టాలనే ఆలోచన వారికి ఉండదని.. అందుకే ప్రభుత్వమే పరిశ్రమలు, వ్యాపారానికి సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టు, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ వసతులు కల్పించి పారిశ్రామిక రంగంలో వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి మధిర నియోజక వర్గంలో పునాది పడిందన్నారు. ఎప్పుడూ వ్యవసాయం అని ఒకే రంగంపై ఆధారపడితే క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ఇబ్బందులు పడతామని... వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధి చేసుకొని సమగ్ర అభివృద్ధి సాధిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. గ్రామాల్లో బాగా చదువుకున్న వారు ఉన్నారని.. అందరికీ ఉద్యోగాలు రావని.. గ్రామాల్లో ఉన్నవారు పరిశ్రమల వైపు మళ్ళితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇదే దేశ భవిష్యత్తుకు మంచిదని తెలిపారు. గ్రామాల్లో వ్యాపారం చేసేవారు సమాజంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో వ్యాపారం చేసేవారు మరింత ముందుకు వెళ్లేందుకు బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు ఇప్పించి వ్యాపారులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. మధిరలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడం దశాబ్దాల కల అన్నారు. 55 ఎకరాల్లో నిర్మించనున్న పార్కుకు 44 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. మధిర పార్కు పనులకు వెంటనే టెండర్లు పిలిచి వేగంగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువత పరిశ్రమల వైపు వచ్చేందుకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు.మధిర ఇండస్ట్రియల్ పార్కును అనుసంధానించేందుకు రెండు వైపులా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి యువత ఈ పారిశ్రామిక ప్రాంతాన్ని సందర్శించేలా తీర్చిదిద్దాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ పార్కులో తక్కువ ధరలకే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయిస్తామని.. కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాలను ప్రోత్సహించాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానికి మధిర సమీపంలో ఉందని.. విజయవాడ-నాగపూర్, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేలు మధిర నియోజకవర్గం మీదుగా వెళుతున్నాయని.. ఇవి అభివృద్ధికి మూల స్తంభాలుగా పనిచేస్తాయని తెలిపారు. మధిర పట్టణం విస్తరణకు కావలసిన బైపాస్ రోడ్లు నిర్మిస్తామని.. చదువుల కోసం, ఉపాధి కోసం మధుర నుంచి ఖమ్మం, హైదరాబాద్, అమెరికాలో స్థిరపడుతున్నారు. ఇక్కడ సమగ్ర అభివృద్ధిని అందిస్తే వారంతా ఇక్కడే స్థిరపడతారని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ వద్ద ప్రత్యేకంగా ఒక ఉద్యోగిని నియమించి పరిశ్రమలు స్థాపించేందుకు వచ్చే వారి నుంచి దరఖాస్తులు తీసుకోవడం.. సమాచారం అందించడం వంటి బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

# బంగ్లా పరిణామాలతో భారత్ అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

టీవీలో దేశ ప్రజలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్‌గా జూన్ 23న వాకరుజ్జమాన్ (58) బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల పాటు పదవీకాలంలో ఉంటారు. ఢంకాలో 1966లో ఆయన జన్మించారు. జనరల్ మహమ్మద్ ముస్తఫిజుర్ రెహ్మాన్ కుమార్తెను వివాహమాడారు. ముస్తఫిజుర్ రెహ్మాన్ 1997 నుంచి 2000 వరకూ ఆర్మీ చీఫ్‌గా పనిచేశారు. వాకరుజ్జమాన్ డిఫెన్స్ స్టడీస్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ బంగ్లాదేశ్ పూర్వవిద్యార్థి కూడా. లండన్ కింగ్స్ కాలేజీ డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఏ చేశారు. దేశ ఆర్మీ చీఫ్‌గా పగ్గాలు చేపట్టానికి ముందు ఆరు నెలలు చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్‌గా పనిచేశారు. మూడు దశాబ్దాల కెరీర్‌లో ఆయన షేక్ హసీనాతో సన్నిహితంగా పనిచేశారు. పీఎంఓ కింద పనిచేసే ఆర్మ్డ్ ఫోర్సెస్ డివిజన్‌కు ప్రిన్సిపల్ స్టాఫ్ ఆఫీసర్‌గా కూడా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్ లో తీవ్ర అల్లర్లకు కారణమైంది. ఇప్పటికే ఆ దేశంలో వందల సంఖ్యలో నిరసనకారులు మృతి చెందారు. ఆదివారం ఒక్క రోజే పోలీసులు జరిపిన కాల్పుల్లో 100 మంది నిరసనకారులు చనిపోయారు. దీంతో ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి. షేక్ హసీనా రాజీనామా చేయాలని నిరసనకారులు పిలుపునిచ్చారు. దేశం అట్టుడుకుతున్న వేళ.. సోమవారం మధ్యాహ్నం ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా సమర్పించారు. అనంతరం రక్షణ నిమిత్తం ఆమె సీ-130 మిలటరీ విమానంలో భారత్‌కి పయనమయ్యారు. ఇకపోతే బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా గాడితప్పాయి. ప్రధాన మంత్రి అధికారిక నివాసంలో భారీ దోపిడీ జరిగింది. గత నెల రోజులుగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న అల్లర్ల వేళ ప్రధాని హసీనా రాజీనామా చేసి దేశం విడిచి భారత్‌కు పారిపోయిన సంగతి తెలిసిందే. దీంతో వేలాది మంది నిరసనకారులు ప్రధాని ఇంటిని ముట్టడించారు. ప్రధాన ద్వారం గేట్లు దూకి వందల మంది ప్రధాని నివాసపు కాంపౌండ్ లోకి ప్రవేశించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. ఇంట్లోకి చొరబడి లోపల మొత్తం లూటీ చేశారు.

ఎన్నో రకాల వస్తువులను ఎత్తుకెళ్లారు. విలువైన ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ప్రధాని నివాసంలో ఉన్న చికెన్, చేపలు, కూరగాయలను కూడా వదలకుండా మొత్తం ఎత్తుకుపోయారు. చాలా మంది విలువైన వస్తువులు తీసుకెళ్తున్నట్లుగా వీడియోలు వైరల్ అయ్యాయి. కాగా పొరుగుదేశంలో ఉద్రికత్తల నడుమ భారత్ కూడా అప్రమత్తం అయింది. షేక్ హసీనా భారత్‌కి వస్తున్నారని తెలుసుకున్న నిరసనకారులు మన దేశంలోకి ప్రవేశించే ప్రమాదం ఉండటంతో భారత్- బంగ్లా సరిహద్దులో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ హైఅలర్ట్ ప్రకటించింది. దాదాపు 4,096 కిలోమీటర్ల మేర ఉన్న భారత్- బంగ్లా సరిహద్దులో అదనపు బలగాలను వెంటనే మోహరించాలని బీఎస్ఎఫ్ అధికారులను ఆదేశించింది. అందరూ కమాండర్లు బార్డర్లోనే ఉండాలని సూచించింది. బంగ్లాదేశ్‌లో హింస పెచ్చుమీరుతున్న వేళ, సైన్యం ప్రభుత్వ బాధ్యతలు చేపట్టడంతో నిరసనకారులు భారత్‌లోకి వచ్చే అవకాశం ఉందని అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు బీఎస్ఎఫ్ తెలిపింది. ఎలాంటి పరిస్థితులైనా తట్టుకునేందుకు సైన్యం సిద్ధంగా ఉందని బీఎస్ఎఫ్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో కూచ్‌బెహార్, పెట్రాపోల్ సరిహద్దుల్లో భద్రత భారీగా పెంచారు. పరిస్థితులను సమీక్షించేందుకు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ ఛౌదరి పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాకు చేరుకున్నారు.

ఓ వైపు బంగ్లాదేశ్‌లో నిరసనలు జరుగుతుండగా.. ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వ్యవహారం చర్చనీయాంశం అయింది. ఉద్యోగులంతా తమ జేబులకు నల్లటి వస్త్రాలను చుట్టుకుని ఆఫీసులకు వచ్చారు. అయితే ఇది బంగ్లాదేశ్‌లో జరిగిన హింసా కాండకు వ్యతిరేకంగా నిరసన తెలపడానికా లేదా నిరసనలకు మద్దతు తెలపడానికా అనేది స్పష్టంగా తెలియరాలేదు. బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో భారత్ నుంచి బంగ్లాదేశ్ వెళ్ళే ఎయిర్ ఇండియా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లుఎయిర్ ఇండియా ప్రకటించింది. ప్రయాణికులు సహకరించాలని కోరింది.

# స్కిల్ వర్సిటీ ఏర్పాటు ద్వారా నైపుణ్య శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

సంతృప్తి బోనస్‌గా లభిస్తుంది..'అని అన్నారు. ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగిందని, గిట్టని వాళ్లందరూ అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదని అన్నారనని, వచ్చినా నిలబడదని అన్నారని సీఎం చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేనిపోని అపోహలు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వాళ్లకు ఇప్పటికే బుద్ధి చెప్పామని, అబద్ధాల కోరుల మాటలు తప్పని నిరూపిద్దామని, హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలుపుదామని సీఎం పిలుపునిచ్చారు. ప్రవాసులు తమ నైపుణ్యాలు, మీ ప్రతిభా పాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారని, ఇకపై తెలంగాణకు సేవలు అందించాలని కోరారు. తెలంగాణలో మెట్రో కోర్ అర్బన్ తో పాటు, సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన పలువురు ముఖ్యులతో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్ తో హైదరాబాద్ ను తీర్చిదిద్దనున్నామని అన్నారు. ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలన్న మా కోరిక నెరవేరింది. ఇప్పుడు రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేయడానికి మనమందరం కష్టపడాలి' అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, వ్యాక్సిన్‌లు, హెల్త్‌కేర్, ఆర్టిఫిషియల్ రంగాల్లో తెలంగాణ బలమైన స్థావరంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ కొత్త సెంటర్



(మొదటి పేజీ తరువాయి)

సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల సందర్భంగా ఈ ఒప్పందం జరిగింది. గత ఏడాది ముఖ్యమంత్రి బృందం దావోస్ పర్యటన సందర్భంగానే ఈ ఒప్పందానికి పునాదులు పడ్డాయి. సాంకేతికత, కొత్త ఆవిష్కరణలకు అభివృద్ధి కేంద్రంగా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందుకే కాగ్నిజెంట్ కంపెనీ హైదరాబాద్ లో తమ కంపెనీ విస్తరణకు మొగ్గు చూపింది.

టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్‌లో తమ కంపెనీ విస్తరించటం సంతోషంగా ఉందని కాగ్నిజెంట్ సీఈవో ఎస్.రవికుమార్ అన్నారు.

హైదరాబాద్ లో నెలకొల్పే కొత్త సెంటర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ క్లయింట్లకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఐటీ సేవలతో పాటు కన్సల్టింగ్ లో అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్ మరియు క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది.

ఐటి రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్ ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని అభిప్రాయపడ్డారు.

కాగ్నిజెంట్ కంపెనీకి తమ ప్రభుత్వం తగినంత మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కొత్త సెంటర్ ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు.

హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర టైర్-2 నగరాలలో కూడా ఐటీ సేవలను విస్తరించాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు కంపెనీ ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేశారు.

ఇప్పటికే ప్రముఖ టెక్ కంపెనీలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయని, ఇక్కడ కొత్త కేంద్రాన్నిస్థాపించాలనే కాగ్నిజెంట్ నిర్ణయం హైదరాబాద్ వృద్ధికి దోహదపడుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు.

# రుణమాఫీ కాని వారి వివరాల సేకరణ

### వాట్సాప్ నంబర్ కేటాయించిన బిఆర్ఎస్
### రుణమాఫీ కాని వారు వివరాలు తెలపండి
### మాజీమంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్5(నమస్తే ఉదయం):** రాష్ట్రంలో రుణమాఫీ కానీ రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని నిర్ణయించింది. లక్ష కానీ, లక్షన్నరలోపు కానీ బ్యాంకులో రుణం తీసుకొని ఉండి, మీకు రుణమాఫీ జరగకపోతే ఈ 8374852619 వాట్సప్ నంబర్‌కి మీ వివరాలు పంపాలని మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. మా తెలంగాణ భవన్‌లో ఇద్దరు వ్యక్తులను ఈ సమస్య మీదనే నియమించాం అని ఆయన తెలిపారు. తెలంగాణ రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాం. మీ పేర పట్టాదార్ పాస్ బుక్ కలిగి ఉండి, అదే పాస్ బుక్ మీద రుణం పొంది ఉండి, లక్ష కానీ, లక్షన్నర లోపు కానీ.. మాఫీ కాకపోతే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు ఆ వివరాలు పంపొచ్చు అని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఏ సర్వే నంబర్ మీద రుణం పొందారు.. ఏ గ్రామం, ఏ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు అనే వివరాలతో ఇతర విషయాలను 8374852619 అనే నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. వివరాలతో మీ రిమార్క్స్ కూడా రాయండి. రుణమాఫీ ఎందుకు కాలేదు.. అధికారులు ఏమన్నారు..? వంటి వివరాలు రాసి పంపించండి అని నిరంజన్ రెడ్డి కోరారు. ఈ వివరాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి మాట్లాడుతాం. చర్చకు పెడుతాం. ప్రభుత్వం ఏం చెబుతదో ఆ వివరాలన్నింటిని సమాజానికి చెబుతాం. ప్రత్యక్షంగా మాటలు అవసరం లేదు.. ఎంత మందికి



వచ్చాయి.. ఎంత మందికి రాలేదో తెలుసుకుందాం. రుణమాఫీ కాని వారికి కూడా వచ్చినట్లు చెబుతూ రైతులను, ప్రజలను మోసం చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ సర్కార్ దుర్మార్గాన్ని ఎండగడుదాం. 2 లక్షల లోపు రుణాలను ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామన్నారు. మరి రూపాయికి బదులు అమెరికా డాలర్లు తీసుకొచ్చి చేస్తారేమో చూద్దాం అని రేవంత్ సర్కార్‌పై నిరంజన్ రెడ్డి సెటైర్లు వేశారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు కృషి

### సొమ్ము రికవరీలో సైబర్ సెక్యూరిటీ కృషి
### బాధితులు పోగొట్టుకున్న రూ.85.05 కోట్లు రికవరీ

**హైదరాబాద్,ఆగస్ట్5(నమస్తే ఉదయం):** టెక్నాలజీ పెరిగిన తర్వాత సైబర్ బాబులు బాగా రెచ్చిపోతున్నారు. ఇన్నాళ్లు ఇలాంటి వారిని గుర్తించడం కఠినంగానే ఉండేది కానీ వారితో పాటు పోలీసులు కూడా కొత్త పంథాలను ఎంచుకోవడంతో ఇలాంటి దాడులకు పాల్పడేవారిని గుర్తించి వారి నుంచి సొమ్మును దాదాపుగా రికవరీ చేస్తున్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల్లో బాధితుల నుంచి నేరగాళ్లు కాజేసిన సొమ్మును తిరిగి తీసుకొచ్చేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తీవ్రంగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా గత ఐదు నెలల వ్యవధిలో తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీతో కలిసి పోగొట్టుకున్న బాధితుల సొమ్ము రూ.85.05 కోట్లు, అందులో సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోవే రూ.36.8 కోట్లు తిరిగి బాధితులకు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు సైబర్ నేరాలకు సంబంధించి దీర్ఘకాలంగా బ్యాంకుల వద్ద నిలిచిపోయిన బాధితుల సొమ్మును లోక్ ఆదాలత్‌ద్వారా కూడా వారికి ఇప్పించినట్లు తెలిపారు. సైబర్ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న సొమ్మును వారి ఫిర్యాదు ద్వారా ఫ్రీజ్ చేసిన తర్వాత వాటిని 457 సెక్షన్ కింద దర్యాప్తు అధికారి కోర్టులో పిటిషన్ ఫైల్ చేస్తే కోర్టుల అనుమతితో వాటిని బాధితులకు తిరిగి ఇచ్చే అవకాశం ఉందన్నారు. కేవలం హైదరాబాద్?లోనే కాకుండా అన్ని జిల్లాల్లో కూడా దీనిపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇలా ఇప్పటివరకు 6,449 పిటిషన్లకు సంబంధించిన రూ.85.05 కోట్లను బాధితులకు తిరిగి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇలా పోలీసులు, న్యాయ వ్యవస్థ కలిసి ఆర్థిక సైబర్? నేరాల్లో బాధితులకు న్యాయం చేకూర్చుతోందని అధికారులు వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత తెలిపింది.

# డెత్ సెంటర్లుగా ఢిల్లీ కోచింగ్ సెంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించిన సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన న్యాయస్థానం.. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

కోచింగ్ సెంటర్లను నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడింది. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ఢిల్లీకి వచ్చిన విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. నగరంలోని కోచింగ్ సెంటర్లు డెత్ ఛాంబర్‌లుగా మారాయి. వాటిని సక్రమంగా నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఈ ఘటన అందరి కళ్లు తెరిపించింది' అంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇనిస్టిట్యూట్‌లో భద్రతా ప్రమాణాలు అందించే వరకూ ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించుకోవచ్చని సూచించింది. కోచింగ్ సెంటర్లను ఎలాంటి నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారో న్యాయస్థానానికి వివరించాలంటూ కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కాగా.. సెంట్రల్ ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి వరదనీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. నగరంలో విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అధికారుల తీరును ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉచితాలను ప్రోత్సహిస్తూ.. పన్నులు వసూలు చేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతించి డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే ఇలాంటి అనర్థాలకు దారితీస్తుందని పేర్కొంది. ఈ కేసును సీబీఐకి బదిలీ చేసింది. ఈ క్రమంలోనే ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది.

# సెప్టెంబర్‌లో కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేసిందన్నారు. దాంతో జమ్మూ కశ్మీర్‌లో పాక్, గూఢచార సంస్థ, ఐఎస్ఐ కార్యకలాపాలు చాలా వరకు అరికట్టగలిగామని కేంద్రమంత్రి పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డిని బీజేపీ అధిష్ఠానం నియమించిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదో వార్షికోత్సవం సందర్భంగా జమ్మూలోని బానా సింగ్ స్టేడియంలో పార్టీ నిర్వహించిన 'ఏకాత్మ మహోత్సవ్' పాల్గొని, ఆయన ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తూ.. సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆర్టికల్ 370ని రద్దు చేసి, బీజేపీని పొడిగిస్తూ వచ్చిన మార్పులను చూసి ప్రజలు బీజేపీని పూర్తి మెజారిటీతో అధికారంలోకి తీసుకువస్తారనే నమ్మకం ఉందన్నారు. ఇదిలా ఉండగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన సెప్టెంబర్ 30 గడువులోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నాహాలను సమీక్షించేందుకు ఈసీ బృందం ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ జమ్మూకశ్మీర్‌లో పర్యటించబోతున్నది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, ఎస్ఎస్ సంధు అక్కడ పర్యటించనున్నారు. మొదట రాజకీయ పార్టీలతో తొలుత కమిషన్ సమావేశం కానున్నది. సీఈవో, ఎస్పీఎన్‌వో, సెంట్రల్ ఫోర్సెస్ కోఆర్డినేటర్‌తోనూ సమీక్షించనున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో కమిషన్ సమావేశమై ఎన్నికల సహకాలపై సమీక్షించనున్నారు. ఈ నెల 10న జమ్మూలో పర్యటించి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సమావేశమై.. ఆ తర్వాత మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నది.

# కవిత రెగ్యులర్ బెయిల్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

తరపు లాయర్ కోర్టును కోరారు. ఈ క్రమంలో తదుపరి విచారణను జడ్జ్ కావేరి భవేజా వాయిదా వేశారు. అయితే రౌస్ అవెన్యూ కోర్టులో ఎల్లుండి ఏం జరుగుతుందో ఏమో అని బీఆర్ఎస్‌లో టెన్షన్ పెరిగిపోయింది. కాగా.. కవితను మార్చి- 15న తొలుత ఈడీ, ఆ తర్వాత ఏప్రిల్- 11న సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈడీ, సీబీఐ పెట్టిన రెండు కేసుల్లోనూ సాధారణ బెయిల్ ఇవ్వాలన్న పిటిషన్‌ను గతంలోనే ట్రయల్ కోర్టు కొట్టివేసింది. ఈ ఆదేశాలను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేయగా అక్కడా నిరాశే ఎదురైంది. ఈ నేపథ్యంలోనే ట్రయల్ కోర్టులోనే మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జూలై- 22న విచారించిన ట్రయల్ కోర్టు జడ్జి కావేరి బవేజా కేసును సోమవారానికి(ఆగస్టు-05) వాయిదా వేశారు. దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనేది ఆసక్తికరంగా మారిన ఈ పరిస్థితుల్లో మరోసారి విచారణ వాయిదా పడింది. ఇదిలా ఉంటే.. తిహాడ్ జైలులో ఉన్న కవితను ఆమె సోదరుడు, మాజీ మంత్రులు కల్వకుంట్ల కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు ఇవాళ కలిసే అవకాశం ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

# ఉప ఎన్నికలు తప్పవు..!

(మొదటి పేజీ తరువాయి)

ఉప ఎన్నికలు తప్పవని...పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు. మరోవైపు ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల విషయంలో మణిపూర్‌కు సంబంధించి ఎమ్మెల్యే సహా సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణులు పార్టీ బృందానికి తెలిపారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘకాలం పాటు నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఈ అంశాన్ని నాన్చలేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తో పాటు, పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్పీకర్‌కు చేసిన ఫిర్యాదు విషయాన్ని, వాటికి సంబంధించిన పత్రాలను న్యాయ నిపుణులకు బీఆర్ఎస్ నేతలు అందించారు. ఈ విషయంలో ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు తెలిపారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ÷ుప్రీంకోర్టు తీర్పులతోపాటు న్యాయ కోవిదులు, రాజ్యాంగాన్ని నిపుణులు చెబుతున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ద్వారా నెల రోజుల్లో పార్టీ మారిన ఎమ్మెల్యే ల పైన అర్హత వేటు అంశం తేలిపోతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉప ఎన్నికలు తప్పవని... పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామన్నారు. ఒకవైపు జాతీయ స్థాయిలో పార్టీ ఫిరాయింపుల పైన సుద్దపూస ముచ్చట్లు చెబుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. త్వరలోనే కోర్టుల సహాయంతో కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతామన్నారు. ÷ాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులతో జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి హరీష్ రావు, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నోట నీతి మాటలా..?

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్, కేటీఆర్ తమ పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేక పోతున్నారని, తప్పని పరిస్థితుల్లో వాళ్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నామన్నారు. కాంగ్రెస్‌లోకి వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడడానికి కేటీఆర్ చేస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే నవ్వొస్తుందని అన్నారు. రాజకీయాల్లో బీఆర్ఎస్ నీతిగా వ్యవహరించడంలేదన్నారు. బీఆర్ఎస్ సరైన పద్ధతులను పాటించడం లేదని అద్దంకి దయాకర్ విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్‌కు చట్టం, న్యాయం ఎందుకు కనిపించలేదన్నారు. రాజకీయాల్లో అందరికీ ఒకటే న్యాయం ఉంటుందని, మీకో న్యాయం, ఇతరులకు మరో న్యాయం ఉండదని అద్దంకి దయాకర్ తెలిపారు. చట్టపరమైన అంశాలను కాంగ్రెస్ ధీటుగా ఎదుర్కొగలదని తెలిపారు. రాష్ట్రంలో ఈ రకమైన పరిస్థితులు రావడానికి ప్రధాన కారణం కేసీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయింపులు తెలంగాణలో మాత్రమే లేవని.. దేశంలో ఇదో ప్రక్రియగా మారిపోయిందన్నారు. టీడీఎల్పీని, సీఎల్పీని బీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నప్పుడు కేసీఆర్, కేటీఆర్‌కు సిగ్గు అనిపించలేదా అని అద్దంకి ప్రశ్నించారు. ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఫిరాయిపులపై మాట్లాడారు. తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తామని హెచ్చరించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, హరీశ్‌రావుతో కలిసి న్యాయకోవిదులతో సమావేశమయ్యారు. పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తుందని కేటీఆర్ ప్రకటించారు. పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 10 మంది కాంగ్రెస్‌లో చేరగా.. ఒక ఎమ్మెల్యే తిరిగి సొంత గూటికి చేరుకున్నట్లే చేరి, మళ్లీ సిఎం రేవంత్‌ను కలిసి కాంగ్రెస్‌లోనే ఉంటానని అన్నారు. తమ ఎమ్మెల్యేలు రాజీనామా చేయకుండా వేరే పార్టీలో చేరడంపై బీఆర్ఎస్ నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతమందిపై హైకోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా 2/3వ వంతు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని సీఎల్పీని విలీనం చేసుకున్నారు. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడలేదు.



## పూజిత ఎంక్లేవ్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా గంట శరత్ కుమార్

**కూకట్‌పల్లి, ఆగస్టు 5 (నమస్తే ఉదయం):**
నిజాంపేట్ పూజిత ఎంక్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో గంట శరత్ చౌదరి, ప్యానల్ 9 మంది అభ్యర్థులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గంట శరత్ కుమార్ మాట్లాడుతూ కాలనీలలో ఎలాంటి సమస్యలు ఉన్న వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. అదేవిధంగా ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘం తరపున కృషి చేస్తానని అన్నారు. అనంతరం సభ్యులు అధ్యక్షుడిగా ఎన్నికైన గంట శ్రీనివాస్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పాగుంట వెంకన్న స్వామీ వారిని దర్శించుకున్న గద్వాల డీఎస్పి సత్యనారాయణ దంపతులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం):**
కేటిదొడ్డి మండలం వెంకటాపురంలో వెలసిన శ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయన్ని సోమవారం గద్వాల డీఎస్పీ సత్యనారాయణ దంపతులు దర్శించుకుని స్వామీ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి సాదర స్వాగతం పలికి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అదే విదంగా ఆలయ విశిష్టతను ఆలయ అర్చకులు వారికి వివరించి శేష వస్త్రంతో సన్మానించారు. వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. డీఎస్పీ వెంటా కేటిదొడ్డి ఎస్ఐ శ్రీనివాస్ రావు, తదితరులు ఉన్నారు



## ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జరుగుతున్న నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి

**అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 5 (నమస్తే ఉదయం):**
ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రోడ్లు, డ్రైనేజీ పనులను వెంటనే మొదలు పెట్టాలని అదేవిధంగా నాలా పనులలో జాప్యం లేకుండా సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలనగర్ డివిజన్ పరిధిలోని దిల్ కుష్ నగర్ లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ వర్షాలు రావడం వల్ల డ్రైనేజీలు పొంగిపొర్లటం, రోడ్లు సరిగా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అదేవిధంగా గత కొన్ని నెలలుగా నిర్మాణం చేపడుతున్న నాలా పనులలో జాప్యం జరుగుతుందన్నారు. అధికారులు సత్వరమై పనుల్లో జాప్యం చేయకుండా ప్రజలకు అవసరమైన రోడ్డు డ్రైనేజీ పనులను పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు.



## పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది...

**ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**

**కూకట్‌పల్లి, ఆగస్టు 5 (నమస్తే ఉదయం):**
పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ సతీష్ గౌడ్, అధికారులతో కలిసి మొదటి రోజు ఓల్డ్ ఎయిర్పోర్ట్ రోడ్లో ఉన్న చెత్త డంపింగ్ యార్డ్ ని పర్యటించి అక్కడ ఉన్న చెత్తని సిబ్బందితో క్లీన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని అన్నారు. ఎవరైతే ఆటోలలో చెత్త వేయని వారికి అవగాహన కల్పిస్తూ చెత్తను తప్పనిసరిగా ఇంటి ముందుకు వచ్చిన స్వచ్ఛ ఆటోల వేయాల్సిందిగా వాళ్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ పవన్, సి,ఓ ఇందిరా, జవాన్ పోచయ్య, ఎస్ ఎల్ ఎఫ్ లు, ఆర్పీలు పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు పరిరక్షించుకోవాలి

**కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్.**

**కూకట్‌పల్లి, ఆగస్టు 5 (నమస్తే ఉదయం):**
పర్యావరణాన్ని మనం కాపాడితే మనల్ని పర్యావరణం కాపాడుతుందని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పిలుపుమేరకు సోమవారం కెపిహెచ్బి కాలనీ రమ్య గ్రౌండ్ వద్ద ఉన్న వార్డు కార్యాలయంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మొక్కలను పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కనైనా నాటాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్క మ్రాను అయ్యేలా తగిన రక్షణ చర్యలు తీసుకోవలసిన బాధ్యత మొక్క నాటిన వారిదేనన్నారు. ప్రభుత్వ హరిత తెలంగాణ లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు , ప్రవీణ్ ,అరవింద్ రెడ్డి బచ్చుమల్లి, శివ చౌదరి, ఫణి కుమార్, అప్పారావు, ప్రకాష్ , రజిత తదితరులు పాల్గొన్నారు.



# చెట్లే జీవకోటికి జీవనాధారం...

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత..**
**పరిసరాల చుట్టూ స్వచ్ఛత పాటించాలి..**
**స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,ఆగస్టు 05(నమస్తే ఉదయం):**
మానవ మనుగడకు చెట్లే జీవనాధారమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మైలార్ దేవులపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్ప,లక్ష్మీగూడ బస్తీలలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ లతో కలిసి మొక్కలు నాటి స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అధికారులతో కలిసి మాట్లాడుతూ...
మానవుడు ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటాలన్నారు.చెట్లే జీవకోటికి జీవనాధాంమని పేర్కొన్నారు.ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రకృతి వైపరీత్యాలు జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పేర్కొన్నారు.ప్రతి ఇంటి ముందు కనీసం మొక్కలను నాటాలని,నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు.ప్రకృతి వనాల ద్వారా వాతావరణంలో మార్పులు ఏర్పడి అధికంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. గాలి కాలుష్యంతో రకరకాల రోగాలు వస్తున్నాయని,మనిషి మనుగడకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు.ఆక్సిజన్ ఇచ్చే చెట్లను నాటినట్లయితే ఆరోగ్యవంతమైన మనిషిగా బ్రతకడానికి అవకాశం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కోరారు.పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు.రాష్ట్రంలో స్వచ్ఛత, పచ్చదనంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని వివరించారు.ఈ కార్యక్రమం 9 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.ఇంటితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఆవరణలో,చుట్టూ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.
సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ..
తోట్టేలలో,టైర్లలో,పాడుబడిన కూలర్,ట్యాంకులలో నీరు నిలవ ఉంచకూడదని సూచించారు.ఆగస్టు 5వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో అందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు.కుక్కల బెడద ఉన్న ప్రాంతాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారులు రాధారాణి, కాంగ్రెస్ నాయకులు సరికొండ వెంకటేష్, టి.ప్రేమ్ గౌడ్, ఆడికే అర్జున్,నాని,ఆడికే శ్రీశైలం,ఖలీల్, యాదగిరి, రాజ్ ముదిరాజ్,శరణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛదనం - పచ్చదనం విజయవంతం చేద్దాం..

**- జిల్లా కలెక్టర్ బిఎస్ సంతోష్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం):**
రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 5 నుండి ఐదు రోజులపాటు చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం గద్వాల్ మున్సిపల్ కార్యాలయం నుండి చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యం, పచ్చదనం పెంచడమే లక్ష్యంగా చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టి విజయవంతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని పురాతన బావిని సందర్శించి పరిసరాలలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ఆకర్షణీయమైన మొక్కలను నాటాలన్నారు. పరిసర గోడలకు కలరింగ్ చేయించి అందమైన పెయింటింగ్‌లు చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణ ప్రకృతి వనంలో అధికారులతో కలిసి మొక్కలను నాటారు. నాటిన మొక్కలన్నింటిని సంరక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, జడ్పీ సీఈఓ కాంతమ్మ, మున్సిపల్ కమిషనర్ దశరథ్, చేనేత మరియు జౌళి శాఖ అధికారి గోవిందయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






### ఇతర రాష్ట్రాలలో రుణాలు తీసుకున్న
# రైతులకు రుణ మాఫీ వర్తింప చేయాలి

**కలెక్టరు కార్యాలయం ముందు నిరసన చేపట్టిన రైతులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం):**
ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు లో ఉన్న జోగుళాంబ గద్వాల జిల్లా రైతులు ఇతర రాష్ట్రాలలో రుణాలు తీసుకున్నారని, అక్కడ రుణాలు తీసుకున్న రైతులకు కూడా తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ వర్తింపచేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాసు హన్మంతు నాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అలంపూర్ రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు నిరసన చేశారు. ఈ సందర్భంగా నాయకులు బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ...
గద్వాల,అల్లంపూర్ నియోజకవర్గ రైతుల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేసిందని విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా రైతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కర్నూలు జిల్లాకు సరిహద్దుగా ఉండడంతో గత 30 సంవత్సరాలుగా కర్నూలు జిల్లా లో పలు బ్యాంక్‌లో రుణాలు తీసుకోవడం జరిగిందన్నారు. గత కేసిఆర్ ప్రభుత్వంలో పంట రుణమాఫీ సమయంలో రైతులకు కర్నూలుకు చెందిన వివిధ బ్యాంక్షల్లో రుణమాఫీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వము పక్క రాష్ట్రం లోని బ్యాంక్‌లో తెలంగాణ రైతులు రుణాలు తీసుకొంటే ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. వెంటనే జిల్లా రైతులు పక్క రాష్ట్రమైన కర్నూల్ జిల్లా బ్యాంకులో తీసుకున్న రుణలను ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంతోష్ కుమార్ కు రైతులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పల్లెపాడు శంకర్ రెడ్డి,ఆ త్మలింగారెడ్డి, భాస్కర్ రెడ్డి,గోపాల్ రెడ్డి,అంగడి బసవరాజ్, శ్రీరాములు, కురవ పుల్లయ్య, మస్తాన్, తిరుమల్, కె. కృష్ణయ్య,చందు,బి. కృష్ణయ్య నాయుడు, శేషన్న, వెంకటస్వామి బసవరాజ్, కామేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



### గ్రామలలో స్వచ్ఛదనం- పచ్చదనం
# కార్యక్రమం విజయవంతం చేయాలి

**- మండల తహసీల్దార్ గౌతమ కుమార్**

**మొయినాబాద్, ఆగస్టు 05(నమస్తే ఉదయం):**
గ్రామాలను స్వచ్ఛదనం- పచ్చదనంతో అభివృద్ధి చేసుకోవాలని మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్ అన్నారు. సోమవారం స్వచ్ఛదనం–పచ్చదనం పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ నగర్, బాకారం ప్రత్యేక అధికారి, మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్ స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందుకే ప్రభుత్వం స్వచ్ఛదనం–పచ్చదనం పేరుతో కార్యక్ర మాన్ని నిర్వహిస్తుందన్నారు. మొక్కలు నాటుదాము పర్యవర ణాన్ని పరిరక్షించాలన్నారు. ప్రస్తుతం నాటే మొక్కలు మన కోసం కాకపోయినరేపటి తరానికి బంగారు బాటలు వేద్దామని సూచించారు. మన గ్రామంలో చెత్తచెదారాన్ని తొలగించాలని, పరిశుభ్రమైన స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరు కృషి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు స్వచ్ఛత వైపు ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అజీజ్నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జమీల్ అహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజియా సుల్తానా, మండల ఆరిఐ చంద్రమోహన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్, రేషన్ డీలర్ కొత్త భాస్కరెడ్డి, పంచాయతీ సిబ్బంది. శ్రావణ ్నమార్, రాఘవేందర్, మహిళా సంఘాల అధ్యక్షులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.
కేతి రెడ్డిపల్లిలో. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఎలాంటి రోగాలు దరి చేరవని కేతిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి తారాబాయి అన్నారు. సోమవారం నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోడ్లు ఊడ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, యువకులు పాల్గొని రోడ్లను శుభ్రం చేశారు. ఆమె మాట్లా డుతూ... ప్రజలు రోడ్లపై చెత్త వేయవద్దు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గోడుగు యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ సిద్ధయ్య, రెడ్డిమోని యాదయ్య, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక




## శ్రావణమాసం తొలి సోమవారం భక్తుల కిటకిటలాడిన కోటిలింగేశ్వర దేవస్థానం

**కొత్తకోట, ఆగస్టు5(నమస్తే ఉదయం):**
వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానము శ్రావణమాసం తొలి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు తెల్లవారుజాము నుండే దేవాలయానికి చేరుకొని పాలు పెరుగు పంచామృతాలతో భస్మ గంధ కుంకుమ జలాలతో అభిషేకాలు అర్చనలు చేసుకొన్నారు. అర్చకులు ధూపదీప నైవేద్యాలతో మహామంగ హారతులు సమర్పించారు. ఆలయకమిటి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## గద్వాల ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన మున్సిపల్ కమీషనర్ దశరథ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం):**
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గద్వాల మున్సిపల్ కమీషనర్ దశరథ్ సోమ వారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని



ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి పూల మొక్కను అందజేస్తున్న నూతన మున్సిపల్ కమిషనర్ టి దశరథ్

మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమాచార పుస్తకావిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం):**
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమాచార పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు అవుతున్న పథకాలకు సంబంధించిన గణాంక డేటాను శాస్త్రీయంగా, పద్ధతిగా సమీకరించి, వార్షిక పురోగతిని ప్రతిబింబిస్తూ



అందించడం జరిగిందని తెలిపారు. ఈ పుస్తకం జిల్లా అధికారులు, పరిశోధన విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆర్. డి.ఓ రామ్ చందర్, జెడ్పి సి.ఈ.ఓ కాంతమ్మ, సీపీవో లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేష్ బాబు, డీపీవో వెంకట్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, చేనేత మరియు జౌళి శాఖ ఎ.డి గోవిందయ్యా, జిల్లా క్రీడా అధికారి బి.యస్. ఆనంద్ ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తాం

### - డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాస్

**బహదూర్ పూర,ఆగస్టు 5(నమస్తే ఉదయం):**
ప్రజా పాలనలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం బహదూర్ పూర నియోజకవర్గంలోని అన్ని వార్డ్ ఆఫీసులలో



జర్గుతున్న ప్రజా పాలనా అభయహస్తం దరఖాస్తుల నవీకరణలో జాప్యంపై ఫలక్ నూమ సర్కిల్ మునిసిపల్ డిప్యూటీ కమీషనర్ వై.శ్రీనివాస్ రెడ్డిని వారి కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు అడిగి వివరాలు తెలుసుకు న్నారు.
ఈ నవీకరణ లో ఎలాంటి జాప్యం లేకుండా, ప్రజలకు ఏ ఇబంధి లేకుండా చూడాలని, అవసరం అయితే అధనుపు సిబ్బందిని ఏర్పాటు చెయ్యాలని బహదూర్ పూర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పులిపాటి రాజేష్ కుమార్ (రాహుల్ ) డిప్యూటీ కమీషనర్‌ని కోరారు.
డిప్యూటీ కమీషనర్ శ్రీనివాస్‌ని కలిసిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులూ మహమ్మద్ ఇక్బాల్, అబేద్ అలీ, జహానుమా డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ నసీర్, రామ్నాసత్పురా డివిజన్ అధ్యక్షులు జాకేర్, యూత్ కాంగ్రెస్ నాయకులూ మహమ్మద్ బారి తదితరులు ఉన్నారు.

# ఓ యువకుని మరణానికి కారణమైన 15 మందిపై హత్య కేసు నమోదు : ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో



వెంకటేష్ గౌడ్ (ఫైల్ ఫోటో)



మరణించిన వెంకటేష్ గౌడ్ మృతదేహం వద్ద బంధువులు, పోలీసులు

**రాజేంద్ర నగర్, ఆగస్టు5(నమస్తే ఉదయం):**
క్యాబ్ నడిపిస్తున్న సమయంలో ప్రత్యర్థుల చేతిలో గాయపడి రెండు సంవత్సరాలుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు ఆదివారం మరణించాడు. దీంతో ఆ యువకునిపై దాడి చేసిన 15 మందిపై గతంలో హత్యాయత్నం కేసు నమోదు కాగా ఆ యువ కుడు మరణించిన నేపథ్యంలో సోమవారం వారిపై రాజేంద్రనగర్ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి..

**క్యాబ్ డబ్బులు చెల్లించాలంటే దాడి చేసే గాయపరిచారు:**

2022 జూలై 31న రాత్రి ఉప్పర్ పల్లికి చెందిన వివేక్ రెడ్డి బంధువులకు చెందిన ఫంక్షన్ ఉంటే బి.ఎన్.రెడ్డి నగర్ కు వెళ్లాడు . ఫంక్షన్ ముగించుకుని రాత్రి పదిన్నర గంటల సమయంలో ఉప్పర్ పల్లికి క్యాబ్ మాట్లాడుకుని వచ్చాడు. రాత్రి 11 గంటలకు ఉప్పర్ పల్లి చేరుకున్న వివేక్ రెడ్డి క్యాబ్‌కు ఎంత అయిందని డ్రైవర్ గా ఉన్న వెంకటేష్ గౌడ్ ను అడిగాడు. డ్రైవర్ రూ.900 అని చెప్పాడు. నాకు రూ.700లే చూపిస్తుంది అని వివేక్ రెడ్డి అనడంతో వారి మధ్య మాట మాట పెరిగి గొడవకు దారితీసింది. ఇద్దరు తోపులాడుకుం టుండగా వివేక్ రెడ్డి తన మిత్రులకు ఫోన్ చేసి క్యాబ్ డ్రైవర్ గొడవ పడుతున్నాడని, నా మెడలో ఉన్న గొలుసు లాక్కోవాలని ప్రయత్ని స్తున్నాడని సమాచారం ఇచ్చాడు. దీంతో మద్యం తాగుతూ కూర్చున్న స్నేహితులు అక్కడికి చేరుకొని క్యాబ్ డ్రైవర్ ను హాకీ స్టిక్స్, క్రికెట్ వికెట్లతో చితకబాదారు. పోలీసులను పిలిచి నా గొలుసు లాక్కోవాలని ప్రయత్నించా డంటూ వెంకటేష్ గౌడ్‌ను వివేక్ రెడ్డి పట్టించాడు.

**గాయపడ్డ వెంకటేష్ గౌడ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు**

వివేక్ రెడ్డి తో పాటు స్నేహితుల చేతిలో గాయపడ్డ క్యాబ్ డ్రైవర్ వెంకటేష్ గౌడ్‌ను పోలీసులు ఆసుపత్రికి తీసుకెళ్తే బాగుండేది. అలా కాకుండా గొలుసు లాక్కోవాలని ప్రయత్నించాడంటూ వివేక్ రెడ్డి చెప్పడంతో అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు.
ఉదయం బ్లడ్ వామ్ టింగ్స్ చేసుకోవడంతో వెంకటేష్ గౌడ్‌ను ఆసుపత్రికి తరలిం చారు. అయితే ఆస్పత్రికి వెళ్ళిన వెంకటేష్ గౌడ్, కోమాలోకి వెళ్లి పోయాడు.

**15 మందిపై కేసులు నమోదు :**

వెంకటేష్ గౌడ్ రక్తం కప్పుకోవడం, కొమాలోకి వెళ్లడంతో విచారణ జరిపిన రాజేంద్రనగర్ పోలీసులు, సీసీ ఫుటేజీ ఆధారంగా వివేక్ రెడ్డి అతని అనుచరులదే తప్పని నిర్ధారించారు. వెంకటేష్ గౌడ్ ను గాయపరిచిన ఎ. వివేక్ రెడ్డి , ఎలిమినేటి వంశీత్ రెడ్డి అలియాస్ వంశీ అలియాస్ నాని, చిలుకూరి శ్రావణ్ కిరణ్ రెడ్డి, ఆకాష్ రెడ్డి , ఐనాల అంకిత రెడ్డి అలియాస్ లడ్డు, గురజాల మహేందర్ గౌడ్, జిగురు మనోజ్, ఎరసరావు శివకుమార్, జిగురు అజయ్ ముదిరాజ్, ఎలకంటి నరేందర్, చాకలి శివకుమార్, కళ్యాణ మల్లారెడ్డి , గోనె శ్రీకాంత్ రెడ్డి, మల్లారెడ్డి మణి కాంత్ రెడ్డి, రాగుల వరుణ్ రెడ్డి లపై మొదట 321 సెక్షన్ ప్రకారం, ఆ తర్వాత 307 హత్యాయత్నం కేసులు నమోదు చేశారు.ఆదివారం వెంకటేష్ గౌడ్ మరణించడంతో వారందరిపై హత్య కేసు 302 ప్రకారం కేసులు నమోదు చేశారు



హంతకుల వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో

**ఎస్సై అవుదాం అనుకున్న వెంకటేష్ గౌడ్ :**

డిగ్రీ వరకు చదువుకున్న వెంకటేష్ గౌడ్‌ది నల్గొండ జిల్లా, చింతపల్లి మండలం, సాయి రెడ్డిగూడెం గ్రామం. తండ్రి అంజయ్య గౌడ్, తల్లి వెంకటమ్మ లకు నలుగురు ఆడపిల్లల తర్వాత ఐదో సంతానంగా వెంకటేష్ గౌడ్ జన్మించాడు. వెంకటేష్ గౌడ్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఎస్సై రాత పరీక్షకు ప్రిపేర్ అవుతూ బి.ఎన్.రెడ్డి నగర్‌లో అద్దెకు ఉండి రాత్రి వేళల్లో క్యాబ్ డ్రైవర్‌గా పని చేసుకుం టున్నాడు.
ఈ నేపద్యంలోనే అతనిపై దాడి జరిగింది. రెండు సంవ త్సరాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు.

## ప్రజా సమస్యలపై పోరాడుదాం... స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

### - దుద్యాల శ్రీనివాస్,బూర్కుంట సతీష్

**శంషాబాద్, ఆగస్టు 5( నమస్తే ఉదయం):**
ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని. ప్రజల మధ్యన ఉంటూ ప్రజల సమస్యలపై పోరాటం చేద్దామని శంషాబాద్ మండలం మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్. మాజీ జెడ్పిటిసి. డిసిసిబి డైరెక్టర్ బోర్కుంట సతీష్ అన్నారు. సోమవారం శంషాబాద్ మండలంలోని కవ్వగూడ చౌదరిగుడ. సుల్తాన్ పల్లి గ్రామాల్లో శంషాబాద్ మండల బి ఆర్ ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ మోహన్ రావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సతీష్. శ్రీనివాస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల మధ్యన ఉంటూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మరో నాలుగేళ్ల పాటు ఆలు పేరుగాని పోరాటం చేస్తే రాబోయే కాలంలో టిఆర్ఎస్ పార్టీ దే అధికారం అని అన్నారు. నాయకులు కార్యకర్తలు ఉదయం



పడకుండా పార్టీని పటిష్టం చేయడం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తే స్థానిక సంస్థల్లో తగిన గుర్తింపు లభిస్తుందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకుడు కొన మొల్ల శ్రీనివాస్. మల్కారం పాక్స్ డైరెక్టర్స్ బాలరాజ్. వెంకటేష్ వార్డు మెంబర్లు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడిగా వివేకానంద గుప్త...

**శంషాబాద్, ఆగస్టు 5( నమస్తే ఉదయం):**
శంషాబాద్ శాఖ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడిగా గౌత వివేకానంద గుప్తను ఎన్నుకున్నారు. విహెచ్పి జిల్లా కార్యదర్శి రాజు. జిల్లా కోశాధికారి కర్రే నరసింహ.సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఈదుల నరసింహ గౌడ్. రాజు. కార్యదర్శిగా సురేష్ చారి. సహ కార్యదర్శులుగా బాబు రమేష్. రామాంజనేయులు ఎన్నికయ్యారు. బజరంగ్ దళ్ సంయోజక్ గ ఆంజనేయులు యాదవ్. సత్సంగ్ ప్రముఖ చింతల రామకృష్ణ గుప్తా. నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్ గుప్తా. కొత్తపల్లి సిద్ధూ.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలకు గాడ్స్ ఆన్ వారియర్స్ విద్యార్థుల ఘనవిజయం

**కొత్తకోట, ఆగస్టు 5(నమస్తే ఉదయం):**
ఈనెల 4,5, లితేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం గాజువాకలో అగ్ని కల్యాణ మండపంలో గ్రాండ్ కరాటే చంపియన్షిప్ శ్రీ అమరపాని శ్రీనివాస్ రావు మెమోరియల్ ఛాంపియన్షిప్ పోటీలు మూడవ జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు జరిగాయి .ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థినిలు దాదాపు 3,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు మన కొత్తకోట చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే డు ఇండియా విద్యార్థులు పాల్గొని బంగారు వెండి పథకాలతో ఘనవిజయం సాధించారు అని క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు మన అకాడమీ ద్వారా పాల్గొన్న విద్యార్థులు కతస్ కుమ్మితే విభాగాలలో పాల్గొన్నారు వీరిలో అండర్ 10 సంవత్సరాల విభాగాలలో కే దుర్గాప్రసాద్ చారి బంగారు పతకం అండర్ 12 సంవత్సరాల కుమ్మితే విభాగంలో ఏం విజయ్ కుమార్ బంగారు పతకం అండర్-14 సంవత్సరాల కుమ్మితే విభాగంలో ఆర్ తరుణ్ వెండి పతకం సాధించారు ఈ విద్యార్థులను ముఖ్య అతిథుల చేతులుగా మీదుగా మెడల్ సర్టిఫికెట్ని అందించడం జరిగింది ఈ విద్యార్థులు వనపర్తి జిల్లా కొత్తకోట నుంచి ప్రాతినిధ్యం వహించారు ఈ ఛాంపియన్ షిప్‌కి మాస్టర్ అండ్ ఇంచార్జ్ ఎండి ఇంతియాజ్ నీ చీఫ్ ఆర్గనైజర్, ముఖ్య అతిథుల చేతుల మీదుగా వారికి శాలువాతో మెమోటోల ద్వారా వారిని



సన్మానించడం జరిగింది గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే డు ఇండియా మాస్టర్స్ జఫర్ సాదిక్ జి హరీష్ యాదవ్ పృధ్వీరాజ్ బి కురుమూర్తి యాదవ్ ,మంజునాథ్, అనిత ,సుమ అంజి జి పరమేష్ ,శివరాజ్ అరవింద చారి ను విద్యార్థులను అభినందించారు.

## ఫీజు రీయంబర్స్మెంట్ కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో...

**శంషాబాద్, ఆగస్ట్ 5(నమస్తే ఉదయం):**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సోమవారం శంషాబాద్ పట్టణం లోని జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి అని డిమాండ్ చేస్తూ మహా ర్యాలీ నిర్వహించారు. .. స్టేట్ జాయింట్ సెక్రటరీ పృథ్వీ తేజ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న





7000 వేల కోట్ల స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని అదే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉచితలకు కాకుండా విద్యార్థులకు పక్షాన ఉండి ఈ ప్రభుత్వం వెంటనే ఫీజు రివర్స్మెంట్ విడుదల చేయాలని కోరడం జరిగింది అదేవిధంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది రానున్న రోజుల్లో నీకు నీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించడం జరిగింది.
.వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి ఫీజుల దోపిడీని అరికట్టాలిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలిని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో శంషాబాద్ జిల్లా కన్వీనర్ మహేష్, మణికంఠ, ప్రదీప్, అఖిల్, చరణ్, భారత్, శివ పవన్, తిరుపతి, అఖిల్, మనీష్,సాయి, పవన్ విజయ్, దినేష్ చందు, వినయ్, మెగాన, ప్రీతి, అనుష, భార్గవ్ , విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

### కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌ను కోరిన కమిటీ ప్రతినిధులు

**రాజేంద్రనగర్, ఆగస్టు5(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ ను డివిజన్ కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాష్, జిహెచ్ఎంసి అసిస్టెంట్ ఇంజనీర్ వెంకోబా, పారిశుద్ధ్య విభాగం ఇంజనీర్ శ్రీనివాస్‌లతో కలిసి పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ అర్చన అంబేద్కర్ భవన్‌ను సందర్శించారు. అంబేద్కర్ భవనానికి 800 గజాల స్థలం ఉందని నూతన భవనానికి నిర్మాణం కోసం నిధులు కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాష్ కు కమిటీ ముఖ్య సలహాదారు పచ్చ శ్రీనివాసులు, భీమయ్య,కె.నారాయణ. అంబేద్కర్ నగర్ కాలనీ అధ్యక్షుడు గొడుగు సంజీవ్, జంగయ్య, పెరుమల శ్రీకాంత్, కాలనీ సభ్యులు పంబాల రాజు ,పి.పెంటయ్య, బి.మహేష్




,గణేశ్వర్,పి. సీనులు వినతిపత్రం అందజేశారు .భవనాల పత్రాలు కలెక్టర్ ఉత్తర్వులు చూపించారు. అందుకు కార్పొరేటర్ అర్చన అంబేద్కర్ భవన కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733